## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-12-2007, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున గీతాజయంతి. ప్రపంచంలో ఏదైనా ఒక గ్రంథానికి జయంతి చేస్తున్నారు అంటే ఒక్క భగవద్గీతకు తప్పించి ఏ గ్రంథానికి చెయ్యరు. గీతామాత అంటారు, మాత అనే పేరు కూడా భగవద్గీతకే వచ్చింది. చెడ్డ పిల్లలు ఉంటారుగాని చెడ్డతల్లి ఉండదు. కొడుకు తల్లిని చంపి ఆ తలకాయ పట్టుకెళ్ళేటప్పుడు కూడా నన్ను చంపేసినా వీడు మాత్రం క్షేమంగానే ఉండాలి అని ఆ తల్లి అనుకొంటుందట, ఈ స్థానం ఒక్క తల్లికే ఉంది. మనుషులు రకరకాల గుణాలతో ఉంటారు కాని ఎవరినీ విడిచిపెట్టకుండా అందరినీ ప్రేమిస్తుంది గీతామాత, వాడు ఎంత దురాచారి అయినా వాడిని ప్రేమిస్తుంది, అది గీత గొప్పతనం. ఇన్ని రకాల గుణాలు ఉన్న మనుషులను సమన్వయం చేసుకొని అందరినీ సమానంగా చూస్తూ, ఎవరికి తగిన స్థాయిలో వారికి భోదిస్తూ, అందరికి మోక్షసుఖం కలుగజెయ్యాలనుకొనే గ్రంథరాజము భగవద్గీత. కృష్ణుడు కృష్ణుడిగా చెప్పలేదు, భగవంతుడై చెప్పాడు కాబట్టి దానికి భగవద్గీత అని పేరు వచ్చింది. గీత, గంగ, గాయత్రి, గోవింద అని మన సాంప్రదాయంలో చెపుతారు. ఒక్క గీతా గ్రంథం చదివి అర్థం చేసుకొంటే ప్రపంచంలో అన్ని గ్రంథాలు చదివినట్లే, గంగానదిలో స్నానం చేస్తే ప్రపంచంలో ఉన్న అన్ని నదులలో మీరు స్నానం చేసినట్లే, అన్ని మంత్రాలు చేసిన వారికి ఎంత ఫలితం వస్తుందో ఒక్క గాయత్రి చేస్తే అంత ఫలితం వస్తుంది, గోవిందుడికి నమస్కారం పెడితే అందరు దేవతలకు నమస్కారం పెట్టినట్లే, కొంతమంది అన్ని ఏకాదశులు బాగా చేస్తారు, మిగతావి చేయలేకపోయినా చాలామంది ముక్కోటి ఏకాదశి శ్రద్ధగా చేస్తారు. మహావిష్ణువు తొలిఏకాదశి రోజున యోగనిద్రలోనికి వెళతాడు, మరల ముక్కోటిఏకాదశి రోజున వైకుంఠంలో మేల్కొని ఉత్తరద్వారంలో ముక్కోటి దేవతలకు దర్శనమిస్తాడు. మూడుకోట్ల దేవతలకు దర్శనమిచ్చాడు కాబట్టి ఈ రోజును ముక్కోటి ఏకాదశి అంటారు. తిరుపతిలోను, భద్రాచలంలోను ఈరోజు స్వామివారిని ఉత్తరద్వారం గుండా దర్శనం చేయిస్తారు. శైవులు శివరాత్రిని ఎంత శ్రద్ధగా చేస్తారో వైష్ణవులు ముక్కోటి ఏకాదశిని అంత శ్రద్ధగా చేస్తారు.

మీరు చేసే పూజలు, జపాల కంటే, మీరు చేసే సాధనల కంటే ఆహారనియమం గొప్పది, ఆహారనియమానికి మించిన నియమం లేదు. మీరు ఆహారంలో నూనె సరుకులు తినకుండా, మీ శరీరానికి ఏమి పడవో అవి జాగ్రత్తగా చూసుకొంటూ వాటిని తగ్గించుకొని తిండిదగ్గర మీరు జాగ్రత్తగా ఉంటే ఆధ్యాత్మికంగా నూటికి ఏభైమార్కులు వచ్చేస్తాయి. సాధన చేసినా ఆహారనియమం లేనివారు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేరు. ఆహారనియమం వలన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం రెండూ బాగుంటాయి. ఆహార నియమంలో మనం గాంధీగారిని ఆదర్శంగా పెట్టుకోవాలి. భజగోవింద శ్లోకాలలో గోవిందుడిని భజించు అని చెపుతూ, గోవిందుడి రూపాన్ని ధ్యానం చేసుకో, భగవద్గీతను అధ్యయనం చెయ్యి, విష్ణు

సహస్రనామాలను పారాయణ చేసుకో నువ్వు తరిస్తావు అని ఆచార్యులవారు చెప్పారు. భగవద్గీతను కొంచెం అధ్యయనం చేసినా అందులో ఒక్క శ్లోకం నీకు అర్థమైనా నువ్వు తరిస్తావు అని ఆచార్యులవారు చెప్పారు. కామక్రోధాలు రజోగుణంలో నుండి వస్తాయి. కామక్రోధాల యొక్క విజృంభణ తగ్గకపోతే నీకు లోచూపు కలుగదు, లోచూపు లేకపోతే లోపల అంతర్యామిగా ఉన్న పరమాత్మ దర్శనం కూడా సాధ్యం కాదు. గీతలో పరమాత్మ మూడు మాటలు చెప్పాడు. 1. డివోషన్, 2. డిటర్మినేషన్, 3. డిస్క్రిమినేషన్. మహావిష్ణువు పాదాలయందు భక్తి కలిగి ఉండాలి. భక్తి వలన నీకు యోగం సిద్ధిస్తుంది. ఈశ్వరుడి పాదాలయందు భక్తి కలగాలంటే, నీకు నిష్ట కలగాలంటే నీకు పట్టుదల ఉండాలి అంటే నిశ్చయం ఉండాలి. ఆ నిశ్చయం లేకపోతే నీ మనస్సు చెదిరిపోతూ ఉంటుంది, ప్రపంచంలో ఉన్న ఏదో ఆకర్షణ నిన్ను ఈడ్చుకొని పోతుంది. ఇంక డిస్క్రిమినేషన్ అంటే విడగొట్టుకోవాలి. అంటే ఏది తానో దానిని గట్టిగా పట్టుకోవాలి. తాను కానిదాని మీద వైరాగ్యం పెంచుకోవాలి. అంటే ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నం చేయాలి, ఆత్మకానిదాని యందు వైరాగ్యం కలిగిఉండాలి, అది వివేకం వలన వస్తుంది. ఏది తినాలి, ఏది తినకూడదు, ఎవరితో స్నేహం చేయాలి, ఎవరితో స్నేహం చేయకూడదు అని బుద్ధితో విడగొట్టుకుంటే మనకు దారి కనిపిస్తుంది.

భగవాన్ అన్నారు సజ్జనసాంగత్యం వలన సాధన అనే పెట్టుబడి లేకుండా బుద్ధిలో ఉన్న దోషాల నుండి బయటకు వచ్చేయవచ్చు అన్నారు. సజ్జనులు నీ బుద్ధిలో ఉన్న దోషాలను పోగొట్టుకోమని చెప్పరు, వారి ప్రభావం వలన దోషాలు అన్నీ పోతాయి, సజ్జనసాంగత్యం యొక్క వైభవం అట్టిది. రోజూ గంటల తరబడి టీవీ చూస్తూ ఉంటే మీకు తెలియకుండా మీ బుద్ధి మలినమవుతుంది. అందుచేత చూసే విషయాలలో, వినే విషయాలలో, మాట్లాడే విషయాలలో బహుజాగ్రత్తగా ఉండండి. మనస్సు ఎంతవరకు అంతర్ముఖమవుతోంది అని చూసుకోవాలి. మనం సంపదలు వస్తే ఒకరకంగా ఉంటాము, ఆపదలు వస్తే ఒక రకంగా ఉంటాము. ఈ సంపదలు, ఆపదలు అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి, ఇవి ఏమీ నిలబడవు. అంతర్ముఖుడు సంపదలతో గాని, ఆపదలతో గాని జతకట్టడు. ధనగర్వం, అధికారగర్వం, కులగర్వం ఇవి పనికిరావు, ఇవి ఉన్నవాడికి వినయం రాదు. వినయం లేకపోతే మనస్సు అణగదు. సాధన చేసినా ఈ గర్వాలు మనస్సును అంతర్ముఖం కానివ్వవు. అందుచేత మీరు తెలివితో ఈ విషయాలను బాగా అర్థం చేసుకోవాలి. మీ హృదయంలో ఏది ఉందో భగవంతుడు ఖచ్చితంగా ఎక్స్‌రే తీసినట్లు చెప్పగలడు, ఎందుచేతనంటే ఆయన అంతర్యామిగా మీ లోపల ఉన్నాడు. భగవంతుడు కర్మసాక్షి మీ లోపల సాక్షిగా ఉండి అంతా చూస్తూ మరల మనం అనుభవించటానికి కర్మ బ్యాంక్‌లో పడేస్తాడు, ఎవళ్ళ ఎక్కౌంట్ వాళ్ళదే, ఆ టైము చూసుకొని ఒకో కర్మను, ఒకో కర్మను పంపిస్తూ ఉంటాడు. మీరు ఎవరితోనూ శత్రుత్వం పెట్టుకోవద్దు, అధికంగా మిత్రత్వం పెట్టుకోవద్దు, వీటివలన కాలం వృధా అయిపోతుంది. కోరికలు ఉన్నవారికి,

భోగవాంఛ ఉన్నవారికి ఈ ప్రపంచంగాని లేకపోతే ఈ ప్రపంచంతో మనకు పని ఏముంది? నువ్వు ఏమి చేస్తావు, నువ్వు ఏమి చెయ్యగలవు, నీ వల్ల ఏమీ కాదు, అంతా ఈశ్వరసంకల్పానికి వదిలెయ్యి. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి, నువ్వు చెయ్యగలిగింది ఏదో చెయ్యి. కృష్ణుడు ఆయుధం పట్టను అంటే ఆయుధం పట్టనివాడు మనకెందుకు అనుకొన్నాడు ధుర్యోధనుడు. భగవంతుడు ఆయుధం లేకుండా యుద్ధం చేయగలడు అనే బుద్ధి వాడికి లేదు. ఊరికే గుర్రాలు తోలినట్లు నటించి అందరినీ ఊడ్చేస్తాడు, వాడు భగవంతుడు. మనకు భక్తి లేదు, భక్తి ఉంటే భగవంతుడి యొక్క వైభవం మనకు తెలుస్తుంది. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నువ్వు ఏదిగా ఉన్నావో ఆ పదార్థంగా ఉండగలిగితే నిన్ను అనాత్మ ఆకర్షించదు. నీకు ఆత్మనిష్ఠ కుదిరితే, ఆత్మధ్యాస కుదిరితే అనాత్మ నీ జోలికి రాదు, నిన్ను ఆకర్షించదు. దైవాన్ని వదిలేసావు అనుకో ప్రకృతిలో పడిపోతావు.

మనకు కోరిక వచ్చింది అనుకో, దానిని వెంటనే నెరవేర్చుకోవటం కంటే దానిని నిగ్రహించుకోవటం వలన కాలప్రవాహంలో ఎక్కువ శాంతిని తీసుకొని వస్తుంది. అసలు మనస్సు అనేది లేదు అంటారు భగవాన్. నీ నీడను చూసి నువ్వు అనుకోవటం ఎలా ఉందో, నీ మనస్సును చూసి నువ్వు అనుకోవటం అలా ఉంది, అసలు అది ఉంటే కదా అన్నారు. ఉన్నదేదో తెలియక పోవటం వలన లేని శరీరాన్ని మనస్సును, గౌరవాలను, డబ్బును నేను అనుకొంటూ ఆ సుడిగుండాలలో పడి ఎంతో శ్రమపడిపోతున్నావు. నీ హృదయంలో దేవుడు ఉన్నాడు, నీ ప్రక్కన ఉన్నవాడి హృదయంలో కూడా దేవుడు ఉన్నాడు. ఇక్కడ ఉన్న దేవుడిని వదిలేసి ఎక్కడో గుడిలో దేవుడు ఉన్నాడని పారిపోతావు ఏమిటి, లోపలకు చూడటం నేర్చుకో. ఈ విషయాలు బాగున్నాయి, భోగాలు బాగున్నాయి అంటే పరిణామంలో ఇది అంతా దుఃఖంగా మారిపోతుంది. భార్యాభర్తల మధ్య ఉన్నది ప్రేమకాదు, అది మోహం. నా భార్య అంటే నాకు ఇష్టం అని వీడు అంటాడు, మా ఆయన అంటే నాకు ఇష్టం అని ఆవిడ అంటుంది. ఇద్దరిలో ఎవరో ఒకరు చనిపోతే 24 గంటలలో మరల పెళ్ళి చేసేసుకొంటున్నారు, ఇది ఒక డ్రామా. మిమ్మల్ని కాశీ తీసుకొని వెళతాము, రామేశ్వరం తీసుకొని వెళతాము అని భగవాన్‌తో అంటే అక్కడ చూడటానికి ఏమైనా ఉంటే కదా అనేవారు అంటే మనల్ని వెళ్ళవద్దు అని కాదు. మనకి దేహాభిమానం ఉంది కాబట్టి వెళుతూ ఉంటాము. దేహాభిమానం లేనివాడికి చూడటానికి ఏమీ లేదు, వినటానికి ఏమీ లేదు. బ్రహ్మం ఏకం, అద్వితీయం అది ఒకటిగా ఉండటమే కాదు, దానికి ద్వితీయం లేదు. గారె తినేటప్పుడు మేడలో ఉన్న వాడు ఎంత రుచి అనుభవిస్తాడో, తాటాకుఇంటిలో ఉన్నవాడు కూడా అంతే రుచి అనుభవిస్తాడు. ఇల్లు తేడా గాని విషయ సుఖాలు అందరికీ సమానమే. వారు ఎక్కువవారు, వీరు తక్కువవారు, ఇష్టాలు, అయిష్టాలు, హెచ్చుతగ్గులు ఇవన్నీ మనస్సులో ఉన్న పెంట, ముందు ఈ పెంటను వదిలించుకోండి. నువ్వు ఏదిగా ఉన్నావో అక్కడ స్థిరంగా ఉండు, అందులో నిలబడి ఉండు, దాని నిష్ట కలిగిఉండు,

అక్కడే రమించు, అదే నిజమైన రతి, అప్పుడు వాడు స్థితప్రజ్ఞుడు అవుతాడు.

పూజ, జపం, ధ్యానం చేసేవాడికంటే కర్మ చేస్తూ ఫలితాన్ని త్యాగం చేసేవాడు గొప్పవాడు, ఆత్మనిష్ఠ కలిగిన వాడు కర్మఫలత్యాగి కంటే గొప్పవాడు. మీకు ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి, కంగారు పడకూడదు. ఆ దుఃఖం ఎందుకు వస్తోంది అంటే మీ బుద్ధిలో ఉన్న దోషాలు తీసేయటానికే అది వస్తోంది, దానిని ఎంజాయ్ చేయండి. గారెలు బాగున్నాయి, గారెలు బాగున్నాయి అని వాటిని తింటూ ఎంజాయ్ చేస్తున్నారు కదా అలాగే దుఃఖాన్ని కూడా ఎంజాయ్ చేయండి. సంపదలు ఆపదలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి, అవి నిలకడగా ఉండవు, ఎందుచేత నిలకడగా ఉండవు అంటే అవి అబద్దాలు, అబద్ధం ఏమి నిలకడగా ఉంటుంది. అవి నిలకడగా ఉండవు కాబట్టి కొంచెం సహించటం నేర్చుకో, అలా సహించటం వలన నీకు లోచూపు కలుగుతుంది. సంపదవచ్చేటప్పుడు ఎలా వస్తుందో తెలియదు, పోయేటప్పుడు ఎలా పోతుందో తెలియదు. మీకు సంపదలు వచ్చినా, ఆపదలు వచ్చినా అవి మీరు కాదు, వాటితో కలవకండి, వాటి ప్రభావం మీ మెదడు మీద పడనివ్వవద్దు. బాహ్యగొడవలతోటి, నువ్వుకాని గొడవలతోటి తాదాత్మ్యం పొందావా నువ్వు ఎన్ని జన్మలు ఎత్తినా బహిర్ముఖుడుగా ఉంటావుగాని అంతర్ముఖుడవు అవ్వలేవు, అంతర్ముఖుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మనస్సు యొక్క మూలం ఎక్కడ ఉందో, మనస్సును నియమించేవాడు ఎక్కడ ఉన్నాడో అటువైపుకు మనస్సు జరుగుతోందో లేదో మీరు చూసుకోవాలి, సాధన యొక్క ప్రయోజనం అదే. మనస్సును నిగ్రహించి దాని మూలంలోనికి పంపితే, మనస్సు తన యజమానిని చూసిన వెంటనే అది నశిస్తుంది, అది నశించిన వెంటనే అక్కడ ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు. మనస్సుకు మూలం, ప్రాణానికి మూలం ఒక్కటే అంటున్నారు కదా మరి మనస్సు నశించినప్పుడు, ప్రాణం కూడా నశించాలి కదా మరి ముక్కులో గాలి ఎందుకు తిరుగుతోంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ముక్కులో గాలి ఎందుకు తిరుగుతోంది అంటే ఆ దేహానికి ఒక ప్రారబ్దం ఉంటుంది. దేహం ప్రారబ్దం అనుభవించటానికి అక్కడ ప్రాణాన్ని నిలబెట్టాడు. మనస్సు నశించిన తరువాత ప్రారబ్ధం యొక్క ప్రభావం ఆ శరీరం మీద ఏమీ ఉండదు. ఆ శరీరం ద్వారా భగవంతుడు పనిచేస్తాడు.

ఈశ్వరుని దయవలన, గురువు యొక్క అకారణప్రేమ వలన జీవలక్షణాలు పోవాలి గాని మన తెలివితేటల వలన పోవు. నీకు భక్తి ఉన్నంత మాత్రం చేత ముక్తి వచ్చేయదు. భక్తి నీ చేతిలో ఉంది, నువ్వు భక్తిగా ఉండు, ముక్తి ఎప్పుడు వస్తుంది అని ఎదురు చూడవద్దు, ఉద్రేకపడకు, ముక్తిని ఎప్పుడు ఇవ్వాలో భగవంతుడు చూసుకొంటాడు, అది ఆయనకు వదిలెయ్యి. నీకు భక్తి అనేది సిన్సియర్‌గా ఉందో, లేదో చూసుకో. అక్కడ రాజీ పడవద్దు. శ్రీవారి పాదాలయందు నీ మనస్సు నిలబడుతోందో లేదో చూసుకోవటం మానివేసి ముక్తి అంటే అదిరాదు, అది నీ చేతిలో లేని పని. తపస్సు చేయాలి అంటే ఎక్కడికో పారిపోవటం కాదు,

మనం ఇంటి దగ్గర ఉండి తపస్సు చేసుకోవచ్చు. శరీరం, మాట, మనస్సు ఈ మూడింటితో చేసేదే తపస్సు. శరీరానికి సంబంధించిన ఇంద్రియాలను కంట్రోలులో పెట్టుకోవాలి. మనం మాట్లాడేమాట మృదువుగా ఉండాలి, ఇతరులకు ప్రియంగా ఉండాలి. మనం ఒక మాట చెపితే అది ఎదుటివారికి అర్థమయ్యే లాగ ఉండాలి, వారి మెదడుకు స్పష్టత రావాలి. సబ్జక్టు చెపితే సరిపోదు, అది అర్థమయ్యేలాగ చెప్పాలి, మీరు ఎంతవరకు ఫాలో అవుతున్నారో చూసుకోవాలి. సబ్జక్టు పట్ల అవగాహన వస్తే సాధన తేలికగా ఉంటుంది. మనస్సును చాలా పవిత్రంగా ఉంచుకోవాలి. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో చూసుకోవాలి, మనస్సును పవిత్రం చేసే తలంపులు వస్తూఉంటే అది మనస్సుతో చేసే తపస్సు. మన ఇంటి దగ్గర తపస్సు చేసుకొంటే బాగా సాగటంలేదు, అరుణాచలంలో బాగా సాగుతుంది అనుకొంటాము. ఇంటి దగ్గర కూడా బాగా తపస్సు చేసుకోవచ్చు అనే బుద్ధి మనకు రానివ్వటంలేదు. వాడే శనిగాడు, మనం బాగుపడకుండా మనలను శనిగాడు పట్టుకొన్నాడు. మనం బాగుపడినా శరీరం, మాట, మనస్సే కారణం, ఒకవేళ మనం పాడైపోయినా ఇవి మూడే కారణం.

వివేకానందుడి దగ్గరకు ఒకడు వచ్చాడు, వాడు యం.ఏ., చదివాడు, అదే జీవితం అనుకొంటున్నాడు. తరువాత ఏమి చేస్తావు అన్నాడు వివేకానందుడు. ఉద్యోగం సంపాదించుకొంటాను అన్నాడు. తరువాత ఏమి చేస్తావు అంటే పెళ్ళి చూసుకొంటాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే పిల్లలను కంటాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే సంపాదించుకొంటాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే ముసలివాడిని అయిపోతాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే చనిపోతాను అన్నాడు. ఈ పనులన్నీ చనిపోవటానికే చేస్తున్నావా? నీ జీవితానికి గమ్యం లేదా? చనిపోవటమే నీ పనా ఇంకో పని లేదా నీకు. నీ జీవితంలో ఏది పొందాలో నీకు తెలియటం లేదు, నీకు ఏది శ్రేయస్సో నీకు తెలియటం లేదు. జీవితంలో నీవు సాధించాలి అనుకొనే దానిని బట్టే నీ జీవితం యొక్క క్వాలిటీ పెరుగుతుంది. లక్ష్యం లేనప్పుడు నువ్వు ప్రయత్నం చేసినా క్వాలిటీ పెరగదు. లక్ష్యం లేని జీవితం ఎప్పుడూ దుఃఖమయంగా ఉంటుంది. ధ్యానం చేయటం మంచిదే. ధ్యానం చేసేటప్పుడు చేసేవాడు కనిపిస్తున్నాడు అనుకోండి అది నిజమైన ధ్యానం కాదు. అలాగని ధ్యానం చెయ్యటం మానకండి. రమణమహర్షిగారు ఏమి చెప్పారు అంటే జాగ్రదవస్థ, స్వప్నావస్థ, గాఢనిద్ర ఈ మూడు అవస్థలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి, ఇవి మూడూ అబద్ధాలే. అనేక జన్మలనుండి వీటికి అలవాటు పడిపోయాము. ఇవి అబద్ధాలు కాబట్టే వస్తూఉంటాయి, పోతూఉంటాయి. అనేక జన్మల నుండి వీటిని అనుభవిస్తున్నాము కాబట్టి అవి నిజం కాకపోయినా నిజంలాగ కనిపిస్తున్నాయి. వచ్చేది, పోయేదీ ఏదీ నిజం కాదు. ఈ మూడు ఎంత అబద్ధాలో అంత నిజం అనుకొంటున్నారు, అందుచేత మీకు లోచూపు కలగటం లేదు. దీర్ఘకాలం నుండి ఈ అలవాటు ఉండటం వలన అది నిజం కింద అనిపిస్తోంది. ముందు అది అబద్ధం అని అర్థం చేసుకో.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 10 | ఈడూరు టి.టి.డి. కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 17 | భీమవరం తాడిమళ్ళ జగన్నాథరాజు కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 21 | హైదరాబాద్ శ్రీనివాస నగర్ కమ్యూనిటీ హాల్ |
| ఫిబ్రవరి | 25 | సఖినేటిపల్లి గీతా మందిరం |
| ఫిబ్రవరి | 29 | విజయవాడ ముత్యాలంపాడు శివాలయం |
| మార్చి | 6 | చించినాడ శివరాత్రి |
| మార్చి | 10 | లక్కవరం సరస్వతీ శిశుమందిరం మ॥ గం॥ 3-00లకు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**పశ్చిమగోదావరి జిల్లా పాలమూరులో జరిగిన సత్సంగ సదస్సులో శ్రీ నాన్నగార్కి స్వాగతం చెప్పిన శ్రీ కలిదిండి నరసింహరాజుగారు, రిటైర్డ్ చీఫ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్**

# బ్రహ్మాన్ని స్మరించటం సంపద - బ్రహ్మాన్ని మరిచిపోవటం ఆపద

మన మనస్సు ద్వారా ప్రపంచాన్ని గుర్తిస్తూ దానితో సంబంధం పెట్టుకొంటున్నాము. ఈ మనస్సు ఆత్మ స్మరణలో ఉంటే బాహ్య ప్రపంచం అదృశ్యమై చైతన్యమే మిగులుతుంది. ఆత్మలో అనేక వస్తువులతో కూడిన ప్రపంచము లేదు కాబట్టి ఇంత వరకూ అనుభవించిన మిధ్యా వస్తు జ్ఞాపకాలను మరచిన క్షణాన్ని అహంకారం సత్యంలో ఐక్యం అయిపోతుంది. విషయ భోగవాంఛగల వానిని "రాగి" అని అవిలేని వానిని "విరాగి" అని అంటారు. జడపదార్థాలు మనిషికి సుఖదుఃఖాలను ఇవ్వగల్గుతున్నాయి అంటే మనిషిలోని ఇష్టాయిష్టాల విలువలే కారణం. జ్ఞానికి కోరికలు ఉండవు కాబట్టి వ్యామోహం ఉండదు. గత స్మృతులను పూర్తిగా తుడిచి వెయ్యగలిగినప్పడే అహంకారం అంతమౌతుంది. దాన్ని సాధించాలి అంటే మనం ఏదైతే అయి ఉన్నామో ఆ బ్రహ్మాన్ని స్మరించాలి. ఏదైతే కాదో దాన్ని స్మరించటం వల్ల అంధకారణ్యంలో తిరుగుతూ ఆపదల పాలౌతాము. పాలను కాచి తోడుపెట్టి కదలకుండా ఉంచితే పెరుగు అవుతుంది, దాన్ని చిలికితే వెన్న వస్తుంది. మనస్సు వెన్నలా అయితే శ్రీకృష్ణుడు ఇష్టంగా స్వీకరిస్తాడు దాన్ని. సాధన దశలో ఏకాంతంగా భగవంతునికోసం పరితపించాలి. దైవీ సంపదలాంటి విచారణ, సంతోషం, సత్సంగము, సమత్వము, చిత్తశుద్ధి ఉంటే మోక్ష ద్వారాలు తెరుచుకొంటాయి. శమం వల్ల శ్రేయస్సు, సమత్వం వల్ల చల్లని బుద్ధి కలిగి విషయాన్ని గ్రహించి బ్రహ్మస్మరణ చేసి మధురంగా జీవించగలము. సర్వ భూతాలను తనలా చూచేవాడు, ప్రయత్నంతో ఇంద్రియాలను నిగ్రహించినవాడు బ్రహ్మ సంపదను పొందుతాడు. పూల తోటకు నీరు పెట్టటం వల్ల మనోజ్ఞమైన పూలగుత్తులు పూస్తాయి. అలాగే సత్సంగము వల్ల బ్రహ్మ స్మరణ వల్ల, సత్ గ్రంథపఠనము వల్ల స్వభావికమైన ఆత్మజ్ఞానం లభిస్తుంది. ఈ జ్ఞాన శాంతి అనే అమృతాన్ని వదలి, విషయ భోగాలవైపు మనస్సు పరుగిడటం అంటే కల్ప వృక్షమును త్యజించి విషఫలాలను ఇచ్చే వనంలోకి వెళ్ళడం లాంటిది. స్మరణ అంటే ఏకాగ్రతతో ధ్యేయ వస్తువైన బ్రహ్మంపై నూరుశాతం దృష్టిని నిలపాలి అలాకాక, మాల చేతిలోనే తిరుగుతుంది. నామంతో నాలుక నోటిలో తిరగుతుంది కాని మనస్సు పది దిక్కులా తిరుగుతుంది. అది స్మరణ కాదు. స్మరణలో కాలగతి తెలియకూడదు, సుఖం రావాలి అదే నిజమైన సంపద ఆ సంపదతోనే బ్రహ్మం అనుభవమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం